క్లుప్తంగా

నల్లబ్యాడ్జీలతో నిరసన



పెద్దపప్పూరు పీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

గార్లదిన్నె: గార్లదిన్నె, యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే డాక్టర్లు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించారు. ఈసందర్భంగా యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జీఓ 85తో తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. రెండు నెలలుగా జీఓ 85 రద్దు చేయమని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. రెండు రోజులు వైద్య సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించిక పోతే ఈనెల 14 నుంచి అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందిస్తామన్నారు. అలాగే 15న ఛలో విజయవాడ, 16న నిరవధిక నిరాహార దీక్ష చేపడతామన్నారు.

యాడికి: పెద్దపప్పూరులోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద మంగళవారం జీఓ 85కు వ్యతిరేకంగా వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్విని మాట్లాడుతూ బుధవారం నుంచి రెండు రోజులపాటు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వైద్యులకు వైద్య సిబ్బంది మద్దతు తెలిపారు.

ఇద్దరి బైండోవర్

యాడికి: మండలంలో రాత్రి పూట అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. వారి నుంచి వివిధ రకాల పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఈరన్న తెలిపిన మేరకు... సోమవారం రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు యాడికిలోని వాగ్దేవి పాఠశాల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు తారసపడ్డారన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనుమానితులను పామిడిలోని బెస్త వీధికి చెందిన అప్పయ్య కుమారుడు దేరంగుల వీరయ్య, వడ్డే వీధికి చెందిన నారాయణ స్వామి కుమారుడు శ్రీనివాసులుగా గుర్తించామన్నారు. వీరి నుంచి ఏడు స్పానర్లు, 3 రించ్‌లు, 4 బిట్లు, 3 ఎల్‌బిట్లు, ఓ కొవ్వొత్తి, అగ్గిపెట్టెను స్వాధీనం చేసుకుని, ఏ నేరమూ చేయకుండా ఉండేలా మంగళవారం ఉదయం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు వివరించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి



ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గుంతకల్లు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్లకు వత్తాసు పలకడంతోపాటు కార్మికుల పొట్ట కొట్టడానికి కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు రైతులు దాదాపు 20వేల ఎకరాల భూముల ఇచ్చారని, చాలా మంది ప్రాణాలు త్యాగం చేశారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణతో వారి త్యాగా వృథా కారాదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరయ్య, ఉమర్ బాషా, మల్లయ్య, చిదంబరం, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఆర్‌ఎస్‌లో నాణేల ప్రదర్శన



నాణేలను తిలకిస్తున్న విద్యార్థులు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయం ఎదురుగా రైల్వే పెన్షనర్ల భవన ఆవరణలో మంగళవారం నాణేల ప్రదర్శన చేపట్టారు. రాయలసీమ నాణేల సేకరణ సంఘం(తాడిపత్రి) ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ఆసుపత్రి డాక్టర్ వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైల్వే అధికారులు, రైల్వే యూనియన్ల నాయకులు, కార్మికులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు నాణేల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రెటరీ రామాంజులరెడ్డి, నిర్వాహకులు నాగరాజారావు, విష్ణు భూషణ్, సదాశివ రెడ్డి, రాజేష్‌రెడ్డి, సంజీవ్, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



చిత్రావతి నదిలో నిమజ్జనం చేయకుండా వదిలేసిన వినాయకుడు



అరకొర నీటిలో పడేసిన వినాయక విగ్రహాలు

గణనాథా మన్నించు..

యల్లనూరు: వర్షాభావం మనుషులకే కాదు.. దేవుడికీ కష్టాలు తెచ్చిపెడుతోంది. చిత్రావతి నదిలో తగినంత నీరు లేకపోవడంతో వినాయకుడిని అలాగే వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలవ్యాప్తంగా సోమవారం వినాయక విగ్రహాలను తాడిపత్రి- సింహాద్రిపురం ప్రధాన రహదారి పక్కన యల్లనూరు చిత్రావతి నదిలో నిమజ్జనం చేశారు. అయితే నీరు లేక ఎక్కడ పడితే అక్కడ విగ్రహాలను వదిలేసి వెళ్లారు. మనకు కష్టాలు వస్తే దేవుడికి చెప్తాం..... అదే ఆ దేవుడికే కష్టాలు వస్తే ఎవ్వరికి చెప్పుకుంటాడని అటుగా వెళ్తున్న వారు చర్చించుకోవడం కనిపించింది.

పబ్లిసిటీ మీద ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదు

• మాజీ ఎమ్మెల్యే వైవీఆర్



గుంతకల్లు: సీఎం చంద్రబాబుకు పబ్లిసిటీ మీద ఉన్న శ్రద్ధ ప్రజలను ఆదుకోవడంలో లేదని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ గత నెల 30న భారీ వర్షాలు కురుస్తాయని ముందుస్తుగా వాతావరణ శాఖ నుంచి సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి ముందుస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. భారీ స్థాయిలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రభావంతో కృష్ణా నదితోపాటు సమీపంలోని బుడమేరుకు ముప్పు ఉందని అధికారులు తెలియజేశాసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నీటి పారుదల, పోలీసు, మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖలను అప్రమత్తం చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఉంటే ఇంత పెద్ద విపత్తు జరిగేది కాదన్నారు. ప్రభుత్వం వైఫల్యంతో దాదాపు 60 మందికిపైగా ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.



వేలాది కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి రోడ్డున పడ్డాయన్నారు. ఈ భారీ వరదలకు మూడు రోజులు పాటు అధికార యంత్రంగా కనీసం సహాయక చర్యలు చేపట్టలేకపోయారంటే అక్కడ పరిస్థితి ఎంతో భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజలు తాగడానికి కనీసం నీళ్ల లేక..తినడానికి తిండి లేక ఆకలితో అలమటించారన్నారు. ఇక చిన్నపిల్లలు, వృద్ధుల బాధలు వర్ణనాతీతమన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పాలన అనుభవం అంటూ పదేపదే గొప్పలు చెప్పుకొనే చంద్రబాబు దక్షత ఈ విపత్తుతో తేలిపోయిందన్నారు. ఈ విపత్తు వేళ జగనన్న ప్రవేశపెట్టిన వలంటర్ వ్యవస్థను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి అవగాహన లేక ప్రజలు అష్టకష్టాలు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వరద కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.25 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆముదంలో 'లద్దె' రాకుండా జాగ్రత్తలు పాటించండి

గుంతకల్లు రూరల్: ఆముదం పంటలో పొగాకు లద్దె పురుగు రాకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ స్వాతి రైతులకు సూచించారు. మంగళవారంకసాపురం, దోసలుడుకి గ్రామాల్లో పర్యటించిన ఆమె గ్రామాల్లో ఆముదం పంటను పరిశీలించారు. పంటను పొగాకు లద్దెపురుగు ఆశించిన నేపథ్యంలో రైతులతో కసాపురం రైతు భరోసా కేంద్రం వద్ద సమావేశం నిర్వహించి నివారణ చర్యలను వివరించారు. పొగాకు లద్దెపురుగు ఆకులను మొత్తం తినేసి కేవలం ఈనెలను మాత్రమే మిగిలిస్తుందని, పూతను కూడా తినడం వల్ల దిగుబడి పూర్తీగా పడిపోతుందన్నారు. వాతావరణ చల్లగా ఉన్న సమయాల్లో మాత్రమే పురుగు పంటపై దాడి చేస్తుందని తెలిపారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే ఈ పురుగును ఏరివేయాలని లేదా క్లోరోఫైరీఫాస్ 50 శాతం మందును అదేవిధంగా సైపెర్మెత్రిన్ 4 శాతం మందును లీటర్‌కు 2 ఎంఎల్ చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతి మరీ ఎక్కువగా ఉంటే నోవాల్యురాన్ 5.25 శాతం మందును ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.9 శాతం మందును లీటర్‌కు 2 ఎంఎల్ చొప్పున కలుపుకొని సాయంత్రం లేదా ఉదయం సమయాల్లో పిచికారీ చేయాలని సూచించారు.



ఆముదం పంటను పరిశీలిస్తున్న దృశ్యం

భవన కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాడిపత్రి రూరల్: భవన కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి, సహాయ కార్యదర్శి ఉమా గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక తాహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి వారు ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ ఇళ్లు కట్టించి ఇచ్చే కార్మికులకు స్వగృహాలు లేవన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన భవన నిర్మాణ కార్మికుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు, వ్యవసాయ కూలీలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయప్రసాద్‌కు అంద చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు,రమణ, రవికుమార్, కృష్ణ నాయక్, గోవింద నాయక్, శ్రీరాములు, రామక్రిష్ణ, శాంతి, శారద, శివమ్మ, ఆదిలక్ష్మి, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



బేతాపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణపతి



వేలంలో గణేశ్ లడ్డూను దక్కించుకున్న భక్తుడు

గుత్తి: మండలంలోని తొండపాడు, బేతాపల్లి గ్రామాల్లో మంగళవారం గణనాథుల నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ట్రాక్టర్లు, ఆటోల్లో వినాయక విగ్రహాలను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. యువకులు నృత్యాలతో అలరించారు. అనంతరం గ్రామ శివారులోని కుంటలకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఆశా బేగం బందోబస్తు నిర్వహించారు.

లడ్డూ వేలం..

పామిడి: స్థానిక షావుకారువీధిలోని పెద్ద వితోబ ఆలయం వద్ద లాల్‌బాగ్ చా రాజా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక ప్రతిమ వద్ద మంగళవారం గణేష్ లడ్డూకు వేలంపాట నిర్వహించారు. మహేంద్రకర్ వసంతరావు అండ్ సన్స్ స్వామి లడ్డూను రూ.18011కు దక్కించుకున్నారు. ఈసందర్భంగా మండపంలో అన్నదానం చేపట్టారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మంగళవారం వినాయక నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్సీ కాలనీవాసులు వినాయక విగ్రహాలు పురవీధుల్లో ఊరేగించారు. ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

శాశ్వత హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శాశ్వత హుండీ కానుకలను లెక్కించారు. ఈసందర్భంగా రూ.2,34,838 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ బాబు తెలిపారు. దేవదాయశాఖ అనంతపురము డివిజన్ తనిఖీ అధికారి లక్ష్మీనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీలో 'హ్యాకథాన్'

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఐఐసీ సెల్ ఆధ్వర్యంలో హ్యాకథాన్ ఎస్‌ఐహెచ్-2024 ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ఎస్‌ఐహెచ్-2024లో ఆరోగ్య, సాంకేతిక, పునరుత్పాదక, స్థిరమైన శక్తి మొదలైన వివిధ సాంకేతిక అంశాలు ఉన్నాయన్నారు. ఇందులో వివిధ భాగాలకు చెందిన 97 మంది విద్యార్థులు తమ వినూత్నమైన ఆలోచనలు 10 మంది బృందం ముందు పంచుకున్నారన్నారు. ఏఐసీటీఈ ద్వారా నవంబర్‌లో జరగబోయే ఈవెంట్ కోసం 50 మంది విద్యార్థులను బృందంగా ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఐఐసీ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూసీ డైరెక్టర్ సాయి చైతన్య కిశోర్, డాక్టర్ ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మనోధైర్యం ఎంతో అవసరం

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువుతో పాటు మనో ధైర్యం ఎంతో అవసరమని సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ కోరి పేర్కొన్నారు. జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో సెమినార్ హాల్‌లో మంగళవారం మనస్తత్వ శాస్త్రం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కోరి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నమోదవుతున్న ఆత్మహత్యలు, వాటికి గల కారణాలను వివరించారు. మానసికంగా ఏ ఇబ్బందులు ఉన్నా తల్లిదండ్రులు, స్నేహితులతో పంచుకోవాలన్నారు. విద్యార్థులు తోటి వారి మద్దతు తప్పనిసరిగా తీసుకోవాలని యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ షీలారెడ్డి తెలియజేశారు. మనస్తత్వ శాస్త్రజ్ఞురాలు డాక్టర్ కావ్య ఆత్మహత్యల హెచ్చరికల సంకేతాలను వివరించారు. వివిధ రకాల ఆత్మహత్యలపై వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకురాలు షేమా, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలని వినూత్న నిరసన

బుక్కరాయసముద్రం: తమ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు వినూత్న నిరసన చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలోని చెరువులో దిగి నిరసన తెలియజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మిక సంఘం నాయకుడు రాఘవేంద్రాచారి పేర్కొన్నారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలు ఎలా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించేత వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు దేవదాస్, కిష్టప్ప, నాగరాజు, పెద్దన్న, విశ్వరూప, విశ్వనాథ్ వలి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ కల్లూరులో మంగళవారం సత్యసాయి కార్మికులు 20వ రోజు సమ్మె కొనసాగించారు. ఈసందర్భంగా సత్యసాయి కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు నాగభూషణం, బాషా, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, నాగవర్ధనం, సాంబశివ, జనార్దన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బీకేఎస్ చెరువులోకి దిగి నిరసన చేస్తున్న కార్మికులు

117 జీఓ రద్దు చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

గుత్తి: ఉపాధ్యాయులకు నష్టం కలిగించే జీవో 117 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు మంగళవారం గుత్తితో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రమణయ్య, గుత్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆసీఫ్, బసవరాజు,జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎస్టీయూ నాయకులు డానియేల్, సూర్యప్రకాష్‌రెడ్డి, వన్నయ్య, సత్యనారాయణ, కృష్ణమూర్తి, నారాయణ స్వామి, ఆంజనేయులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోండి

తాడిపత్రి అర్బన్: పట్టణంలో బుధవారం తలపెట్టిన గణేషుని నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నిర్వాహకులకు పోలీసులు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో గణేష్ నిమజ్జనంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అర్బన్ సీఐ సాయిప్రసాద్ మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద గణేషుని శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. నిమజ్జనం ముగిసే వరకు ఆయా విగ్రహాల నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని అన్నారు. మద్యం సేవించి కార్యక్రమంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సాయంత్రం ఆరు గంటలకల్లా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు. భారీ విగ్రహాలను రూరల్ పరిధిలోని చింతకుంట సమీపంలోని నీటికుంట, చిన్న విగ్రహాలను పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి సమీపంలోని కుంటలో నిమజ్జనం చేయాలన్నారు. బీజేపీ నాయకులు అంకాల్‌రెడ్డి, సింగరి లక్ష్మీనారాయణ, విశ్వహిందూపరిషత్ నాయకుడు రాధాకృష్ణ, ఏబీవీపీ నాయకుడు గంగాధర్‌యాదవ్, ఆయా మండపాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీర వనిత చాకలి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: చాకలి ఐలమ్మ తెలంగాణ వీరవనిత అని సీపీఐ నేతలు కొనియాడారు. మంగళవారం స్థానిక నెహ్రూ పార్క్‌లో సీపీఐ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ వీర వనిత 1895 సెప్టెంబర్ 26న జన్మించిన చిట్యాల ఐలమ్మ తన పోరాటాల ద్వారా చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిందన్నారు. తన పోరాటాల ద్వారా ఐలమ్మ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. వృత్తిదారుల సంఘం నాయకులు భాస్కర్, గురునాథ్, రంగనాథ్, తిరుపాలు, ఏఐటీయూసీ నాయకులు రమణ, శ్రీనివాసులు, ఉమాగౌడ్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో మంగళవారం రజక వృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాసులు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు

యల్లనూరు: మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న బాలబాలికలకు ఈనెల 12,13 తేదీల్లో మండలస్థాయి క్రీడా పోటీలు ఉంటాయని మంగళవారం ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్‌ఐ పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, యోగా, బ్యాడ్మింటన్, వాలీబాల్ , అథ్లెటిక్స్‌లో అండర్-14,17 విభాగాల్లో చిలమకూరు ఆదర్శ పాఠశాలలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాడికి: పెద్దపప్పూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత శాస్త్ర అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పీరియడ్‌కు రూ.150 ప్రకారం నెలకు రూ.10వేలు మించకుండా వేతనం ఇస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు 3 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టీ, సీఈటీ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సాలాబాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌టీ, సీఈటీ కోర్సుల్లో పీజీ(ద్వితీయశ్రేణి మార్కులతో) ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గాలిమరల కార్మికుల నిరసన

పుట్లూరు: ఎల్లుట్ల గ్రామ సమీపంలో ఉన్న గాలిమరల వద్ద కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. తమకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని వాపోయారు. గాలిమరలకు వెళ్లే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హేమాద్రి సంఘటనా స్థలానికి వెళ్లి కార్మికుల సమస్యపై ఆరా తీశారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందించాలని గాలిమరల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా తమ వద్ద ఎలాంటి పెండింగ్ బిల్లులు లేవని కాంట్రాక్టర్‌కు అందజేసినట్లు వారు తెలిపారు. వేతనాలు అందేలా చూస్తామని ఎస్‌ఐ చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన వెంకటరాముడు

యల్లనూరు: నీర్జాంపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..చిలమకూరు గ్రామానికి చెందిన వెంకటరాముడు తాడిమర్రి మండలం కునుకుంట్లలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. నీర్జాంపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.